# మంచుదెబ్బ

జీవితం గొప్ప థ్రిల్లింగ్‌గా వుంది ప్రత్యూషకు. ఆకుల రెప్పల మాటున ఒదిగిన తుషార కణాలు, కలకల నాదాలతో మేఘాల అంచుల వైపు తరలి వెళ్తున్న పక్షుల సమూహం, కలల పలవరింపుల్లో నవ్వు వెన్నెల్ని వెదజల్లుతున్న పాపాయిలు- సృష్టిలోని అందాలన్నీ రెట్టింపు మనోహరంగా కనిపించసాగాయి.

అతి సీరియస్‌గా వుండే గైనిక్ మేడమ్, జూనియర్ డాక్టర్ల దగ్గర వీరఫోజు కొట్టే మిడిగుడ్ల థియేటర్ సిస్టర్, ప్రైవేట్ ప్రాక్టీస్‌లో కూరుకుపోయి విద్యార్థులకు పాఠాలు చెప్పే ఝంఝాటాన్ని వదిలించుకున్న సర్జరీ ప్రొఫెసర్ - అందరూ మంచి వాళ్ళుగా, ప్రేమ పాత్రులుగా కనిపించసాగారు.

తనలో ఇంత అద్భుతమైన మార్పుకు కారకుడైన సందీప్ వెంట గర్వంగా నడుస్తూంది ప్రత్యూష. అందరూ తమ వంక అసూయగా చూస్తున్నట్లు, 'ఎంత అందమైన జంట' అని నివ్వెర పోతున్నట్లు, ఇంత సౌందర్యం తమకు దక్కలేదే అని అబ్బాయిలు, ఇంత ఛార్మింగ్ యంగ్‌మాన్ ప్రక్కన నడిచే అదృష్టం తమకు లేకపోయిందే అని అమ్మాయిలు బాధపడిపోతున్నట్లుగా అనిపించసాగింది. మెత్తని తివాచీ మీద అలవోకగా అడుగు లేస్తూ, నిలువెత్తు అద్దాల్లో ప్రతిఫలిస్తున్న తమ

ప్రతిబింబాల్ని ఓర కంటితో చూస్తూ, మురిసిపోతూ పిక్చర్ హాల్లో అడుగు పెట్టింది ప్రత్యూష.

వెనుక వరసలో అటూ, యిటూ ఎవరూ లేకుండా చూచుకుని కూర్చున్నాక చిత్రమైన ఉద్వేగంతో కంపించసాగింది ప్రత్యూష హృదయం. పిక్చర్ చూస్తూన్నంత సేపూ ఆ క్షణమో మరుక్షణమో తనలోని ప్రత్యణువునూ స్పందింప చేస్తూ మధురమైన అనుభూతి లభిస్తుందని ఎదురు చూస్తూంది. "ప్రత్యూ!" పర్వత సానువుల మీద నుండి జారిపడుతున్న జలపాతపు ధ్వని, పరవశంతో నర్తిస్తున్న నర్తకి పద మంజీరాల మంజుల నాదం కలగలిపి వినిపించిన అనుభూతి... అతని చేతుల్లో తన చేతులు మృదువుగా నలుగుతున్నాయి. అతని వెచ్చని ఊపిరి తన చెంపల్ని కాలుస్తూంది. కాంక్షతో నిండిన అతని కళ్లు తనలోని చైతన్యాన్ని లాగేసు కుంటున్నాయి.

"ఎక్స్‌క్యూజ్‌మి" చెంపకు చెయ్యి చేర్చి కిందకి చూస్తూ అందమైన కలకంటున్న ప్రత్యూష ఉలిక్కిపడి సందీప్ వంక చూచింది. నిటారుగా కాలుమీద కాలేసుకుని కూర్చుని తన వంక రొమాంటిక్‌గా కాక నిర్లిప్తంగా చూస్తున్న సందీప్- అసంతృప్తితో మూలిగింది ప్రత్యూష హృదయం.

"మీకు బోర్‌గా వుందా? యింటికి వెళ్ళి పోదామా?" ఆంగ్లంలో అడిగాడతను "నొ...నొ..." మృదువుగా నవ్వి తెరవైపు కళ్ళు తిప్పింది ప్రత్యూష. ఎనిమిదేళ్ళుగా అమెరికాలో వుంటున్న సందీప్ తెలుగును పూర్తిగా మరచిపోయినట్లుగానే మాట్లాడతాడు. పెళ్ళయాక ఈ నాలుగురోజులుగా యితనితో కలిసి బ్రతుకుతున్నా తన స్వంత భర్తతో గాక పరాయి వ్యక్తితో మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తూంది. మరో నాలుగోజుల్లో ఇతను అమెరికా వెళ్ళిపోతాడు. తనకు ఫైనలియర్ పూర్తయి, హౌస్ సర్జన్సీ అయిపోయాక గానీ యితని దగ్గరకు వెళ్ళలేదు. సెలవును మరికొన్ని రోజులు పొడిగించి వుండిపోమని చెప్పాలని ఎంతో కోరికగా వుంది. కానీ, ఆ కోరికను వెల్లడించడానికి జంకుగా వుంది. తన మనసులోని మాటను వెలిబుచ్చగల సాన్నిహిత్యాన్నివ్వని అతని గంభీరతను చూస్తుంటే బెరుకుగా ఉంది. ఇంతటి రూపసి, అమెరికాలో పనిచేస్తున్న డాక్టరుతో తన బ్రతుకు ముడిపడినందుకు సంతోషంగా, గర్వంగా వుంది.

"నాకెందుకో ఈ సంబంధం ఇష్టం లేదు" ప్రత్యూష తల్లి భార్గవి అంది ఈ సంబంధం గురించి తెలిసినప్పుడు.

"అదేం? ఎందుకని మమ్మీ?" ఇంత మంచి సంబంధం మమ్మీకెందుకు యిష్టంగా లేదో అర్థంగాక ఆశ్చర్యంగా చూచింది ప్రత్యూష.

"అమెరికా వెళ్ళాలన్న ఆతృతలో నువ్వు సావకాశంగా ఆలోచించడంలేదు బేబీ!" కూతురితో తన సందేహాల్నెలా చెప్పాలో తెలియక ఒక నిముషం తటపటా యించింది భార్గవి.

"ఇన్నేళ్ళుగా అమెరికాలో ఒంటరిగా వుంటున్న కుర్రాడు..." తల్లి మనసులోని సందేహాన్ని గ్రహించి మధ్యలోనే అందుకుంది ప్రత్యూష.

"ఏ ఎఫైర్స్ లేకుండా ఉండి వుంటాడా అని అనుమానిస్తున్నావు కదూ? అక్కడవుంటున్న కుర్రాడికే ఎఫైర్స్ వుండాలని రూలుందా? యిక్కడ వుండే వాళ్లకు వుండకూడదా?" విదేశంలో వుండే వాళ్ళకే ప్రేమ వ్యవహారాలుంటాయి. యిక్కడ వున్న వాళ్ళంతా కుదురుగా వుండి పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారని అనుకునేంత అమాయకురాలు కాదు భార్గవి. ప్రేమ, ఆప్యాయత పునాదుల మీదకాక డబ్బు ప్రాతిపదికతో అవుతున్న ప్రస్తుత వివాహాలెంత అస్తవ్యస్తంగా తయారవుతున్నాయో చూస్తూనే వుంది. ఆలుమగల మధ్య ఏ ఒడుదుడుకులొచ్చినా సర్దడానికి, ధైర్యం చెప్పడానికి, తెలిస్తే రెక్కలుకట్టుకుని వాలడానికి విదేశంలో వుంటే ఎలా కుదురుతుంది?- తల్లి అనుమానాలు విని ఫక్కున నవ్వింది ప్రత్యూష.

"పిచ్చి మమ్మీ! రోజూ పేపరు తెరిస్తే చాలు ఎవరో ఒక అమ్మాయి అత్త మామల అత్యాచారాలు భరించలేక ఆత్మహత్య చేసుకుందనో, హత్య చేయబడిం దనో చూస్తూనే వున్నాం కదా!? పేపర్లోకెక్కని అలాంటి వందలాది ఆడపిల్లల తల్లిదండ్రులు ఈ దేశంలోనే వుండి ఏం చెయ్యగలుగుతున్నారు? తమ కూతుళ్ళ కాపురాల్ని సరిచెయ్యగలుగుతున్నారా? నీకు మేమున్నాం. బ్రతుకుమీద ఆశ చంపుకో వద్దని ధైర్యం చెప్పగలుగుతున్నారా? భర్త తిట్టినా, కొట్టినా , చంపినా అత్తిల్లే శరణ్యమని ధర్మపన్నాలు నూరిపోస్తున్నారు తప్ప. చచ్చి చెడి పెళ్ళి చేసి పంపిన కూతురి బాధ్యతను మళ్ళీ భుజాల మీద కెత్తుకోవడాని కెవరైనా సంసిద్ధంగా వుంటున్నారా? నడిస్తే అరిగిపోతుందన్నట్లుగా పెంచి, కట్నంతో సహా ధారపోసి, తమబిడ్డను అష్టకష్టాలు పెట్టి పొట్టనపెట్టుకున్న వాళ్లను శిక్షించే గట్టి ప్రయత్నమెవరైనా చేస్తున్నారా? ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భార్యను అమానుషంగా చంపిన కిరాతకుడని తెలిసికూడా హారతులిచ్చి మరీ తమ కూతుర్ని కట్టబెడ్తున్నారు తప్ప- 'వెధవా, నీకీ సంఘంలో బ్రతికే హక్కు, అర్హత లేదురా' అని చీదరించుకొని

తరిమి కొట్టే గుండెధైర్యం గల వాళ్ళెవరైనా వున్నారా?" ఆవేశంగా ప్రశ్నిస్తున్న కూతురి వంక నిర్ఘాంత పోయి చూస్తూంది భార్గవి. జీవితాన్ని జాలీ జాలీగా, చాలా లైట్‌గా తీసుకునే ప్రత్యూష ఆ మాత్రం లోతుగా ఆలోచిస్తుందని అనుకోని భార్గవి ఆమె వంక ఓ క్రొత్త వ్యక్తిని చూస్తున్నట్లు చూస్తూంది. కాని... ఎందుకో సందీప్‌ని చేసుకుంటే తన కూతురి సంసారం సవ్యంగా నడవదేమోనన్న భీతి, దూరాన ఎలాంటి అవాంఛనీయ పరిస్థితుల్ని ఎదుర్కొనవలసి వస్తుందోనన్న ఆదుర్దా ఆమెను నిలవనివ్వడం లేదు. ముఖ్యంగా సందీప్ తల్లిని తలచు కుంటే ఆమె ఆందోళన తీవ్రమవసాగింది.

"ఐతే అన్నీ తెలిసికూడా అతన్నే పెళ్ళాడతానని పట్టుపడుతున్నావా?" విసుగ్గా చూచింది భార్గవి.

"తప్పేముంది మమ్మీ! నాకు,కావలసిన అర్హతలతనిలో వున్నాయి. వాళ్లకు కావలిసిన అర్హతలు నాలో ఉన్నాయి. మిగిలినవన్నీ చాలా చిన్న సమస్యలు." కూతురి అభిప్రాయాలు సబబుగా కనిపించలేదు భార్గవికి. పిల్లల మస్తత్వాలు, ప్రవర్తన కొంత వరకు తల్లిదండ్రుల మీద, ఇంటి వాతావరణం మీద, కుటుంబ సభ్యుల సంస్కారం, సదవగాహన మీద ఆధారపడి వుంటుందని నమ్మే భార్గవి అతి లౌక్యంగా, కపటంగా, కుటిలంగా కనిపిస్తున్న సందీప్ తల్లిని తలచుకుని, ఆమెకు కోడలవబోతున్న తన కూతురి జీవితం గురించి బెంబేలు పడింది. తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్న ప్రత్యూష గురించి భయపడింది.

తల్లి మనసులోని విముఖతను పోగొట్టడానికి, ఆమెవన్నీ అనవసరపు భయాలని నిరూపించడానికి ప్రయత్నిస్తూంది ప్రత్యూష . "అతని తల్లి గురించి కూడా మనం జడిసి పోనవసరం లేదు మమ్మీ! నేను ఫ్లోరిడాలో, ఆవిడ కలకత్తాలో ఉండేది. యిన్ని వేల మైళ్ల దూరం నుండి కూడా అత్త పెత్తనం చెలాయించ గల ఘనురాలంటావా ఆవిడ?" చిన్నగా నవ్వింది ప్రత్యూష.

"ఆఁ! అంతటి సమర్ధురాల్లాగానే కనిపిస్తూంది. ఆ మానవుడు, ఆవిడ భర్తగారు మౌన వ్రతం పాటిస్తూ ప్రతి దానికీ నమోనారాయణలాగ వుండి పోతాడు. ఇంక ఆవిడను అడ్డుకునే వారే లేదు. ఈ పిల్లాడూ తల్లికి తగ్గ తాళమేసే మనిషి లాగానే వున్నాడు." విచారంగా అంది భార్గవి. తల్లి చెక్కిలి మీద గాఢంగా ముద్దు పెట్టుకుంది ప్రత్యూష.

"ఇంత పిరికిదానివెప్పుడయ్యావు మమ్మీ! వాళ్లు ఆరళ్ళు పెడ్తే తట్టుకోలేక

ఆత్మహత్య చేసుకునేంత వెఱ్ఱికుట్టె అనుకుంటున్నావా నీ కూతురు?... అతనొక వేళ నాకు నచ్చని దారిలో వుండుంటే అతన్ని మార్చుకుంటాను. అదీ, నా ప్రేమతో... భార్యననే అధికారంతో కాదు."

తల్లి అభ్యంతరాలు, తన వాదన గుర్తొచ్చి చిన్నగా నవ్వుకుంటూ సందీప్ వేపు చూచింది ప్రత్యూష. అందంగా మలిచిన శిల్పంలా కూర్చుని దీక్షగా సినిమా చూస్తున్నాడతను. అంతకు ముందువరకు ఉద్వేగంతో చలించిన ప్రత్యూష హృదయం క్రమేపీ చల్లబడి మంచుముద్దలా అయింది. తన వ్యక్తిత్వం, సౌందర్యం తన భర్తను కదిలించలేక పోతున్నాయన్న నిజం ఆమె హృదయాన్ని కాలుస్తూంది. పెళ్ళి, పెళ్ళి తరువాత తామిద్దరూ గడపబోతున్న అపురూపమైన కాలం గురించి తనెన్నో అందమైన కలలు కంది. తనవారి భయాలతో, అత్తగారి ఆశపోతు కోరికల్తో, భర్త యాంత్రిక ప్రవర్తనతో తన బ్రతుకులో యిదొక తీపి గుర్తుగా కాక చేదు అనుభవంలా మిగిలి పోయేలా వుంది. అంతలోనే తనను తాను హెచ్చరించుకుని నచ్చచెప్పుకుంది ప్రత్యూష. "నో...నో... తనిలా నిరాశతో క్రుంగి పోకూడదు. ఏ భావాలతో, ఏ అభ్యంతరాలతో, ఏ ఇన్హిబిషన్స్‌తో అతనింతగా ముడుచుకుని వున్నాడో తను గ్రహించాలి. తన ప్రేమతో, లాలింపుతో ఇతన్ని గెలుచు కోవాలి. తన నించి అతనేం కోరుకుంటున్నాడో, ఏ విధంగా తను ప్రవర్తించాలను కుంటున్నాడో గుర్తించి దానికనుగుణంగా తను మారాలి..." అలా అని నిశ్చయించు కున్నాక ఆమె మనసులోని అలజడి కొంత వరకు తగ్గింది.

పిక్చర్ అయిపోయాక ఇంటికి వచ్చే సరికి ప్రత్యూష తల్లి, తండ్రి మౌనంగా, గంభీరంగా, ఆవేశాన్నీ, బాధనూ నిగ్రహించుకుంటున్నట్లుగా కనిపించారు. కదిపితే కన్నీళ్లు కార్చేలా వున్న తల్లిని అడగడానికి భయపడి నెమ్మదిగా తండ్రి దగ్గరకు చేరింది.

"ఏమయింది డాడీ? ఎందుకలా వున్నారు?" భయం భయంగా అడిగింది ప్రత్యూష. వాసుదేవరావు జీవం లేనట్లు చూసాడు. కూతురు నడిస్తే కందిపోతుంద న్నట్లుగా, ఆమె కాల్లో ముల్లు గుచ్చుకుంటే తన గుండెలో గునపం దిగినట్లుగా అల్లారుముద్దుగా పెంచుకొచ్చాడామెను. ఆమె కోరింది మరుక్షణం జరిపే దాకా అశాంతిగా వుంటుందతనికి. ఆమె పెళ్ళి విషయంలో కూడా భార్యకు యిష్టం లేదని తెలిసినా కూతురికి ఇష్టం కనుక ఒప్పుకొని పెళ్ళి జరిపించడానికి సిద్ధపడ్డాడు.

కాని వియ్యపురాలి గడుసుదనం, దురాశ వల్ల పెద్ద సంకట పరిస్థితి ఎదుర

యింది. మొలతాడు కట్టుకున్న మగాడయితే చాలు, వాడు పైసాకు చెల్లకపోయినా వాడి పెళ్లికి ఎక్కడెక్కడి కోరికలూ మగపెళ్ళి వారికి పుట్టుకు రావడం చూస్తూనే వున్నా, తీరా అంతా నిశ్చయమయాక కట్నం రేటును మరో లక్ష పెంచేసరికి తబ్బిబ్బు పడిపోయాడు. నిజానికి అప్పటికే తనకు శక్తికి మించిన భారమయినా కూతురి కోరిక తీర్చడం కోసం ఒప్పుకున్నాడు. మరో లక్ష అంటే తను అప్పుల్లో మునిగిపోవలసిందే. విషయం విని భార్గవి గయ్‌మంది.

"మన పిల్లకు ఏం తక్కువని యిలా అన్నిటికీ లొంగిపోవాలండీ? గుణంలో, చదువులో, రూపంలో అతనికేవిధంగానూ తీసిపోని దాన్ని కట్నం మాటెత్తకుండా కళ్ల కద్దుకుని చేసుకుని పోవాల్సింది పోయి లక్షల మీద బేరాలా? అసలు మీకూ, మీ కూతురికి మతీ సుతీ లేకుండా పోతూంది. ఇంత హడావిడిగా రెండురోజుల్లో పెళ్ళి నిశ్చయించుకుని నాలుగురోజుల్లోపల పెళ్ళి చేసేయడమేమిటి? ఇంత కంగారుకంగారుగా పెళ్ళిచెయ్యాల్సిన అవసరమేమిటి మనకు? అసలు వాళ్ళేమిటో, వాళ్ల కుటుంబ చరిత్రేమిటో, సంప్రదాయమేమిటో తెలుసుకోకుండా ఏంకొంప మునిగిపోయిందని ఈ హడావిడి?!" భార్గవి అన్నది నిజమే. కానీ... కంగారు పడకపోతే, కొంప మునిగిపోయినట్లు పరుగెత్తక నింపాదిగా చరిత్రలు కనుక్కుంటూ వుండిపోతే, ఆ అవకాశాన్నందిపుచ్చుకుని ఆ సంబంధాన్ని తన్నేసుకుపోవడానికి పోటీకి కాచుక్కూర్చున్నవాళ్ళు బోలెడు మంది వున్నారు.

భార్గవికి విరుద్ధంగా ప్రత్యూష తండ్రిని కాబోయే అత్తగారు కోరిన అదనపు లక్షని ఇవ్వడానికి ఒప్పుకోమని బ్రతిమాలింది. దాంతో మొట్టమొదటి సారి తన పెంపకంలో ఏదో లోపముందనే అనుమానమొచ్చింది వాసుదేవరావుకు. తను సరైన పద్ధతిలో పెంచి వుంటే కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకోడానికి చచ్చినా అంగీకరించేది కాదు ప్రత్యూష. విద్యాధికురాలయిన తనను పెళ్ళి చేసుకోవడానికి లక్షల ముడుపు అడిగినందుకు అవమాన పడిపోయేది. సంతలో పశువుల్ని చూచినట్లు యింతమంది అమ్మాయిల్ని వరసగా చూచి ఎన్నుకోవడాన్ని, మాట నిలకడ లేకుండా కట్నం రేటును పెంచడాన్ని అస్యహ్యించుకుని జన్మలో మళ్ళీ వాళ్ళ ముఖాల్ని చూడడానికంగీకరించేది కాదు. అమెరికా వరుడిని చేసుకోవడమే జీవిత పరమావధిగా, ఆ తరువాత అక్కడ పనిచేయడమే తన చదువుకు లక్ష్యంగా పెట్టుకుని వుండేది కాదు... కాని... తన పెంపకాన్ని సరిజేసుకోవడానికి గాని, జీవితపు విలువలేమిటో ఆమెకు తెలిసేలా చెయ్యడానికి గాని సమయం మించి పోయింది. తను గారాబంతో చేసిన అశ్రద్ధవల్ల, పిల్లలకు సౌకర్యాలు సమకూర్చడం

కంటే ముఖ్యం జీవితపు వాస్తవాల్ని యదాతథంగా చూడగలిగేలా చెయ్యడమనే సంగతిని గుర్తించక పోవడం వల్ల యీ అనర్థం జరిగింది.

"ఏమిటి డాడీ మాట్లాడరు?! ఏమిటంత ఇదిగా ఆలోచిస్తున్నారు?" ప్రత్యూష చేత్తో కదిపాకగాని వాసుదేవరావు ఆలోచనల్లో నుండి బయటపడలేదు.

"ఏం లేదమ్మా! ఇందాక మీ అత్తగారొచ్చింది." చాలా అలసిపోయినట్లుగా, క్రుంగిపోయనట్లుగా కూర్చున్నాడతను. ఎంతో నిజాయితీగల ఆఫీసురుగా పేరు పొంది ఇంటా బయటా సగర్వంగా తలెత్తుకు తిరిగే వాసుదేవరావు కూతురి పెళ్ళి విషయంలో వియ్యాలవారికి తలవంచాల్సివచ్చింది. అవినీతిని, అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించే వ్యక్తి ఎన్నో ఏళ్లుగా నిరాఘాటంగా సాగుతున్న అధర్మాన్ని, ఒక సాంఘిక దురాచారాన్ని కనీసం తన కూతురి విషయంలో ఎదిరించలేకపోయి నందుకు సిగ్గుపడుతున్నాడు.

"ఏమంటుంది? ముఖం చిట్లిస్తూ అడిగింది ప్రత్యూష.

"కట్నంలో సగం క్యాష్‌గా సందీప్ వెళ్ళేలోగా యివ్వాలట. యిప్పటికిప్పడే అంత క్యాష్ ఎక్కడినుంచొస్తుంది? హైదరాబాద్ ఇల్లు అమ్మదామంటే అది ఏమయినాసరే బాబుకు వుండాలని పట్టు పడ్తూంది అమ్మ. అయినా వున్నపళాన అమ్మదామనుకుంటే వాళ్ళయిష్టం వచ్చినంత అడుగుతారు." విచారంగా చెప్పాడు వాసుదేవరావు. అపరాధిలా తల వంచుకుంది ప్రత్యూష.

"అయామ్ సారీ డాడీ! మిమ్మల్ని చాలా కష్టపెడుతున్నాను" ప్రత్యూష కంఠం వణికింది.

"నువ్వేం బాధపడకమ్మా! నేనేదో ఒకటి చేస్తానులే వెళ్ళు. భోజనం చెయ్యండి." కూతురు బాధపడేసరికి విలవిలలాడిపోయిన వాసుదేవరావు అనునయంగా ప్రత్యూష భుజం తట్టాడు.

బాధతో రెపరెపలాడ్తున్న కళ్ళను వాల్చుకుని సందీప్‌ను భోజనానికి పిలవ డానికి తన గదిలోకి వెళ్ళింది ప్రత్యూష.

***

ఎన్నో కలలతో, భయాలతో, అందోళనలతో అమెరికా వెళ్లింది ప్రత్యూష. ఎప్పటి కప్పుడు తనకు తాను నచ్చజెప్పుకుంటూ, వెన్ను చరుచుకుని ధైర్యం చెప్పుకుంటూ, అన్ని లోటుపాట్లనూ సంస్కారవంతమైన కోణం నుంచి చూచి

సర్దుకుంటూ, తన వైవాహిక జీవితం ఫల ప్రదమవు తుందనే ఆశను గుండెల్లో నింపుకుంటూ, అమ్మనీ, నాన్ననీ తొలిసారిగా వదిలి వెళ్తున్నందుకు బెంగటిల్లిపోతూ, యింకా కొన్ని సంత్సరాలదాకా ముద్దుల తమ్ముడిని చూడడానికి అవకాశం వుండదని బాధపడుతూ విమానం ఎక్కింది ప్రత్యూష. తనకు వీడ్కోలివ్వడానికి అత్తగారు, మామగారు కలకత్తా నుండి వస్తారని ఎదురు చూసిన ప్రత్యూషకు భారతనారి విద్యుక్త ధర్మాలగురించి, భర్త అడుగు జాడల్లో నడవవలసిన అవశ్యకత గురించి ఒక పెద్ద వ్యాసాన్ని లెటరుగా వ్రాసి పంపిందామె అత్తగారు.

ప్రత్యూష వెళ్లిన దగ్గర్నుండి ఆమె అక్కడెలా వుందోనని, అక్కడి జీవితంలో యిమిడిపోగలిగిందో లేదోనని, పరిస్థితుల్ని ధైర్యంగా తనకు కావలసినట్లుగా మార్చుకోగలుగుతూందో లేక అలా చెయ్యనూ లేక, రాజీపడనూ లేక గిజగిజలాడి పోతూందోమోనని బెంగపడిపోతూంది భార్గవి. అంతలోనే తనను తాను నిందించుకుంటూంది. 'శుభమా అని తన కూతురు భర్తతో కాపురం చెయ్యడానికి వెళ్తే తనిలా అశుభంగా ఊహించుకుంటూందేమిటి? ఆమె కలకాలం భర్త, పిల్లలతో ఆనందంగా వుండాలి, 'ఆనందంగా వుంటుంది...' గట్టిగా నమ్మించుకున్న కాసేపటి వరకు ఊరడింపుగా వుండేది. మళ్ళీ అంతలోనే పొడిపొడిగా కూతురు వ్రాసిన 'ఇక్కడ క్షేమం, అక్కడ మీరంతా క్షేమమేనని తలుస్తాను' మార్కు లెటర్స్ చూచినప్పుడల్లా అందులో ఆమె సంతోషంగావున్న సూచనలేవీ కనిపించక కలవరపడిపోతోంది. కూతురి పెళ్ళితో ఓ విధమైన వైరాగ్యాన్ని వంట బట్టించుకున్న వాసుదేవరావు 'ఎలా జరగాల్సుంటే అలా జరుగుతుంది. మనం భయపడి, బెంగ పెట్టుకుని చేసేదేం లేదు' అనుకుని మొండిగా వుండడానికి ప్రయత్నిస్తున్నాడు. సందు దొరికినప్పుడల్లా కొడుక్కి వుంచాలనుకున్న యింటిని అమ్మేసి ఆ డబ్బును వియ్యపు రాలి చేతి కప్పగించినందుకు భార్య దెప్పుతూంటే తను తప్పుచేశాడేమో, అలా చెయ్యటంలోకూతురికేమైనా అపకారం జరుగుతుందేమోనని తల్లడిల్లి పోసాగాడు.

నువ్వక్కడ ఎలా వున్నావో, ఏమేం చూసావో, అక్కడి నీ జీవితం, అనుభూతులు, అభిప్రాయాలు అన్నీ వివరంగా వ్రాయమని వారానికో సారి ప్రత్యూషకు లెటరు వ్రాస్తూంది భార్గవి. ఎనిమిది నెలలు ఎంతో భారంగా, సుదీర్ఘంగా గడిచిన తరువాత ఒక రోజు భార్గవి కోరుకున్నట్లుగా ప్రత్యూష దగ్గర్నుండి పెద్ద లెటరు వచ్చింది. సంతోషంతో, ఉద్వేగంతో గుండెలదురుతూ వుండగా అతృతగా లెటరు విప్పింది భార్గవి.

"మైడియర్ మమ్మీ!

చాలా కాలంగా నీకు పెద్ద లెటరు వ్రాయాలనే అనుకుంటున్నాను. కాని నిజాలు వ్రాసి నిన్ను బాధపెట్టడమా లేక అందమైన అబద్ధాలతో నిన్ను మోసగించడమా అనేది తేల్చుకోలేక ముక్తసరి జవాబుల్తో సరిపెట్టాను. ఇప్పుడింక ఎక్కువకాలం మిమ్మల్నా సందిగ్ధస్థితిలో వుంచడమిష్టం లేక నా వాస్తవ జీవితం గురించి వ్రాస్తున్నాను!

మమ్మీ! నువ్వు ధైర్యంగా వుండు. యీ లెటరంతా చదివి నా కూతురి బ్రతుకిలా అయిపోయిందే అని ఏడవకు. నా తొందరపాటు నిర్ణయాల్ని గట్టిగా కాదనలేక ఒప్పుకున్న డాడీవల్లే యిలా జరిగిందని డాడీని కోప్పడవద్దు. ఇది కేవలం నా స్వయంకృతాపరాధం. జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం - పెళ్ళి విషయంలో పైపై మెరుగులకు భ్రమసిపోకుండా పూర్వాపరాలు ఆలోచించి మరీ అడుగు కదపాలి అన్న పాఠాన్ని నా బ్రతుకు నాకు నేర్పింది.

మమ్మీ! నేను కేవలం అమెరికా లగ్జరీలమీద మోజుతో అమెరికాలో పని చేస్తున్న డాక్టర్ని పెళ్ళాడాలనుకోలేదు. హాయిగా, సరదాగా తిరుగుతూ ఎలాగోలా పాసయితే చాలు అన్న లక్ష్యంతో చదివే నాకు పాథాలజీలో ఒకసారి కాకతాళీయంగా ఫస్ట్ వచ్చిందని నీకు గుర్తుండే వుంటుంది. ఎక్కువ విజ్ఞానాన్ని సంపాదించడంలో వుండే తీరని దాహాన్ని క్రమేపీ చవిచూడడం మొదలు పెట్టాను. నాలో ఈ మార్పు వస్తున్న సమయంలోనే అమెరికా వెళ్ళి ప్రపంచంలో యిప్పుడున్న అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని పొందాలనే తపన ఎక్కువయింది. ఒక డాక్టరు అమెరికా వెళ్ళడానికి దగ్గర దారేది అని ఆలోచిస్తే అమెరికాలో వుంటున్న వ్యక్తిని పెళ్ళి చేసుకోవడమేనని తేలింది. అదిగో దాంతో మొదలయింది, అమెరికా అబ్బాయిని చేసుకోవాలనే కోరిక. నాలో యీ కోరిక వృద్ధి పొందుతున్న సమయంలోనే నా ఫ్రెండ్స్ గాయత్రి, సరళ, లక్ష్మి పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళి పోయారు. ప్రతి ఉత్తరంలోనూవాళ్ళు వ్రాసిన విషయాలు, చేసిన వర్ణనలు అగ్నిలో ఆజ్యం పోశాయి.

నాలో పుట్టి, పెరిగి, మహా వటవృక్షంగా అయిన ఫారిన్ క్రేజ్‌కి నేను చెల్లించాల్సిన మూల్యం యింతని నాకు తెలియలేదు మమ్మీ! తెలిసుంటే పదే పదే నువ్వు హెచ్చరించినప్పుడయినా మేలుకుని వుండే దాన్ని. ఎప్పటికప్పుడు అన్నీ సమకూరుస్తూ బ్రతుకులో సుఖమే కాని దుఃఖం అనుభవంలోకి రాకుండా

మీరు పెంచడం వల్ల నేను చాలా అదృష్టవంతురాల్ని, నా జీవితంలో అన్నీ మంచిగానే జరుగుతాయనే అహంకారం నాకు తెలియకుండానే నాలో వుండి వుంటుంది. బహుశా ఆ అహంకారంతోనూ, వయసు పెరిగినా యింకా పసితనం వదలకపోవడం వల్లనూ నేనంత గుడ్డిగా, మొండిగా ప్రవర్తించి వుంటాను. వాళ్ల కుటుంబం గురించి, సందీప్ అలవాట్లు, ప్రవర్తన, మనస్తత్వం గురించి వాకబు చెయ్యకుండా యీ పెళ్ళిమిటని నువ్వెంత మొత్తుకున్నా నేను పెడచెవిని పెట్టాను.

మమ్మీ! ఊహకీ, అనుభవానికీ, ఆలోచనకూ, ఆచరణకూ చాలా తేడా వుందని యిక్కడకు వచ్చాక తెలిసింది. ఈ ఫాస్ట్‌లైఫ్‌తో రాజీపడి అంగీకరించడమో, అంగీకరించ లేకపోతే నా భర్తను నా దారిలోకి తెచ్చుకోవడమో చెయ్యగలననుకున్న నాకు యీ రెండూ అసంభవమైన విషయాలేనని అనుభవంలోకి వచ్చింది. సందీప్ ప్రేమ వ్యవహారాల్ని, సారీ, సెక్స్ వ్యవహారాల్ని నేను సహించలేకపోయాను. సందీప్ శరీరానికి సెక్స్ కావాలి. అతని హృదయానికి ప్రేమ అక్కర్లేదు. యీ నిజం తేటతెల్ల మయిన కొద్దీ నా శరీరం జుగుప్సతో జలదరించింది. సందీప్ అనే యీ అందమైన విగ్రహంలో దాగున్న వికృతమైన మనస్తత్వం పువ్వులాంటి నన్ను చిదిమి, నలిపి, హింసించి ఆనందించింది.

ఏ విధంగానైనా నా కాపురాన్ని నిలబెట్టుకుందామనే తపనతో అతని మనస్తత్వానికి మూలకారణమేమిటో తెలుసుకున్నాను. ఇతని కుటుంబ చరిత్రలో మనకు తెలియని ముఖ్యమైన అంశం ఒకటుంది. మా మామగారుగా చలామణి అవుతున్న వ్యక్తి నా భర్తకు తండ్రికాడు. మా అసలు మామగారు సందీప్‌కు పదేళ్ళ వయసులో చనిపోతే ఆయన ప్రియమైన విద్యార్థి, ఆయన దగ్గర రీసెర్చి స్కాలర్‌గా పని చేస్తున్న వ్యక్తితో కలిసి బ్రతకడం ప్రారంభించింది మా అత్తగారు. తల్లిపట్లవున్న ప్రేమ, తన తండ్రిస్థానంలోకి మరో వ్యక్తిని తెచ్చినందుకు కోపం, అసహ్యం, యీ భావాలు నిరంతరం సంఘర్షించుకుని ఒక విచిత్రమైన మనస్తత్వాన్నిరూపొందించాయి సందీప్‌లో. ఇతనికిప్పుడు స్త్రీ పట్ల వున్నది ప్రేమ, గౌరవం కాదు, అసహ్యం, అపనమ్మకం... యీ సత్యాన్ని తెలుసుకున్నప్పుడు నిశ్చేష్టనయాను. నాయీ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక కలవర పడిపోయాను. ఇంతలో మా అత్తగారిక్కడకు వచ్చింది.

ఆవిడ వచ్చాక నాకు మరికొన్ని విషయాలు తెలిశాయి. డాక్టర్ని కోడలుగా చేసుకుని కొడుకు, కోడలు ఇద్దరితోనూ రెండు చేతులా ఆర్జింపజేసి ఆ డబ్బునంతా తన గుప్పెట్లో పెట్టుకుని పెత్తనం చెలాయించాలని ఆవిడ ప్లాన్. అందుకే

ఆంధ్రదేశమంతా గాలించి నా ఖర్మకాలి నన్ను వరించింది. కోడలి ఆర్జనను గుప్పెట్లో పెట్టుకోవాలంటే ముందామెను మానసికంగా భీరురాల్ని చేసి, భయపెట్టి, పీడించి, తన కనుసన్నల్లో మెలిగేలా చెయ్యాలి. ఆ పథకాన్ననుసరించి నేనింకా యిక్కడ పరీక్షలు పాసయి సంపాదన పరురాల్నయే లోగానే నన్ను వంచాలని వచ్చీ రాగానే తన కార్యక్రమాన్నమలులో పెట్టింది. నా భర్తను మార్చుకునే ప్రయత్నంలో ఓర్మి వహించి సగం లొంగిపోయిన నేను యీ లొంగిపోవడమనేది నా పతనానికి నాంది అవుతుందని గ్రహించి ఎదురు తిరిగాను. నేను ఎదురు తిరిగిన కొద్దీ ఆవిడ మరీ భయంకరంగా మారింది. నన్ను శిక్షించడానికి, నా పొగరణిగి ఆవిడ కాళ్ళ దగ్గర సాగిల పడడానికి కూడూ, నీళ్ళూ లేకుండా మాడ్చింది.

మమ్మీ! నేను నా ఫ్రెండ్ లక్ష్మి దగ్గరకు వచ్చేశాను. నా సంతోషం, ఆశలు, అహంకారం - అన్నీ సమూలంగా విచ్ఛిన్నమయిపోయి, నా కాపురం భగ్నమయి పోయి, ఆలోచించే ఓపిక హరించి, హత్యచేయబడతానేమోననే భీతితో అనుక్షణం వణికిపోతూ వుండగా లక్ష్మికీ విషయం చూచాయగా తెలిసి, నన్నాబంధిఖానా నుండి విడిపించి, ధైర్యం చెప్పి తన దగ్గరకు తీసుకు వచ్చింది.

మమ్మీ రెక్కలు కట్టుకుని నీ దగ్గరకు వచ్చి నీ ఒడిలో తలపెట్టుకుని తనివి దీరా ఏడవాలని వుంది. డాడీ చేతుల్లో వాలి ఓదార్పు పొందాలని వుంది. ఓదార్పు విలువెంతో, తన ప్రక్కన తన ఆత్మీయులుంటే ఎంత ధైర్యం కలుగుతుందో, బ్రతుకు మీద మమకారం ఎలా చచ్చిపోకుండా వుంటుందో యిప్పుడు గ్రహింపు కొచ్చింది నాకు... కాని... ఈ రాక్షసుల ద్వారా నేను పొందిన ఒకే ఒక ఉపకారం, ఈ దేశం రాగలగడాన్ని ఉపయోగించుకుని మరీ వస్తాను. కొన్నేళ్ళిక్కడ శిక్షణ పొంది, ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కొంటూ, నా జీవితానికొక మార్గాన్నీ, గమ్యాన్నీ నిర్దేశించుకుని మీ ముందు నిలుస్తాను. చిందర వందరమయిన నా బ్రతుకును సరి చేసుకున్నాకే మీ దగ్గరకు వస్తాను..."

భార్గవి చేతుల్లోని ఉత్తరం జారిపోయింది. ముంచుదెబ్బ తగిలిన పారిజాతాలు నేలరాలాయి.

- 'ఆంధ్రజ్యోతి వీక్లీ', 1982.